ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## ఖాతాలను బ్లాక్ చేశారు


కాంగ్రెస్ ఆవేదన

2లో..

సంపుటి: 1 | సంచిక: 346 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 22 మార్చి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్ట్

లిక్కర్ కేసులో సంచలన పరిణామం



న్యూఢిల్లీ, మార్చి 21 (ప్రభాత ఉదయం): దాదాపు 2 ఏళ్లుగా సాగుతున్న ఢిల్లీ మద్యం కేసులో ఒక్కసారిగా వేగం అందుకుంది. ఇటీవలె తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్ట్ చేసిన ఈడీ అధికారులు.. తాజాగా ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారు. ఢిల్లీలోని కేజ్రీవాల్ నివాసంలో తనిఖీలు నిర్వహించి.. ఆయన స్టేట్‌మెంట్ తీసుకున్న ఈడీ బృందం.. 2 గంటల తర్వాత చివరికి ఆయనను అరెస్ట్ చేసింది. కేజ్రీవాల్ అరెస్ట్ నేపథ్యంలో ఆయన నివాసం వద్ద భారీగా పోలీసులు, కేంద్ర ప్రభుత్వ బలగాలను మోహరించారు. ఈ నేపథ్యంలోనే కేజ్రీవాల్ నివాసం చుట్టు పక్కల 144 సెక్షన్ విధించారు. అక్కడ ఆప్ మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు, కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. దాదాపు 12 మంది అధికారులతో కూడిన ఈడీ బృందం కేజ్రీవాల్ నివాసంలో సోదాలు జరిపింది. సెర్చ్ వారెంట్‌తోనే వచ్చామని ఈడీ అధికారులు సీఎం ఇంటి వద్ద ఉండే సెక్యూరిటీ సిబ్బందికి చెప్పి.. లోపలికి వెళ్లారు. 2 గంటల తర్వాత కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారు. ఈ క్రమంలోనే కేజ్రీవాల్ సహా ఆయన కుటుంబ సభ్యుల సెల్‌ఫోన్లను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 2022 ఢిల్లీ మద్యం పాలసీ రూపకల్పన సీఎంగా ఉన్న అరవింద్ కేజ్రీవాల్.. ఈ కుంభకోణంలో ఆయన పాత్ర ఉందని ఈడీ అధికారులు ముందు నుంచీ ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే ఢిల్లీ ..మిగతా 2లో



## కాంగ్రెస్‌లో జూనియర్‌ని

నేనెలా సీఎం అవుతా: పొంగులేటి

**బీజేపీ టచ్‌లో ఉన్నారన్న ప్రచారంపై పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

హైదరాబాద్, మార్చి 21 (ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గురువారం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో రాష్ట్రంలో పవర్ షట్ డౌన్ చేసేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. దాన్ని తాము అధికమించామని, ఆ పరిస్థితుల నుంచి బయటపడ్డామని చెప్పారు. ఈ సందర్భంగా మేడిగడ్డ విషయంలో ..మిగతా 2లో



## మల్కాజిగిరిలో కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందే

దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ స్థానం మల్కాజ్‌గిరి

నేను సీఎంగా ఇప్పుడు ఇక్కడ మాట్లాడగలుగుతున్నానంటే


ఆ గొప్పతనం మల్కాజిగిరి నాయకులు, కార్యకర్తలదే

**మల్కాజ్‌గిరి పార్లమెంట్ నేతలతో సీఎం రేవంత్ సమావేశం**

హైదరాబాద్, మార్చి 21 (ప్రభాత ఉదయం): మల్కాజ్‌గిరి పార్లమెంట్ నేతలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. నేను సీఎంగా ఇప్పుడు ఇక్కడ మాట్లాడగలుగుతున్నానంటే ఆ గొప్పతనం మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ నాయకులదన్నారు. ఆనాడు నాయకులు అమ్ముడుపోయినా కార్యకర్తలు భుజాలపై మోసి గెలిపించి నన్ను ఢిల్లీకి పంపించారన్నారు. 2,964 బూత్ లలో ప్రతీ బూత్ లో ఒక సైనికుడిలా కార్యకర్తలు పనిచేశారని ఆయన వ్యాఖ్యానించారు. దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ స్థానం మల్కాజిగిరి అని, నాటి మల్కాజిగిరి గెలుపు తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగేలా చేసిందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. కేసీఆర్ పతనం 2019 మల్కాజిగిరి పార్లమెంట్ నుంచే మొదలైందని, వందరోజులు పూర్తిగా పాలనపైనే దృష్టి పెట్టామని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా..'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ 10లక్షలకు పెంపు, రూ.500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేసుకుంటున్నాం.. మూడు నెలల్లోనే 30వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత మన ప్రభుత్వానిది.. మల్కాజిగిరి అభివృద్ధి కోసం కేంద్రంతో సఖ్యతగా ఉండి స్కైవేల నిర్మాణానికి శంఖుస్థాపన చేసునుకున్నాం.. మెట్రో, ఎంఎంటీఎస్ రావాలన్నా.. జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్య తీరాలన్నా.. కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలి. తెలంగాణ రాష్ట్రమంతా తుఫాను వచ్చినట్లు గెలిచినా మల్కాజిగిరి పార్లమెంట్ లో ఫలితాలు ఆశించిన స్థాయిలో రాలేదు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనీసం 4 స్థానాలు గెలిస్తే అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉండేది.. అందుకే మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందే. అప్పుడే మన ప్రాంతం అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది.
మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవడానికి మనకు అవకాశం వచ్చింది.. పార్లమెంట్ తో పాటు కంటోన్మెంట్ ..మిగతా 2లో

## వర్క్ ఫ్రమ్ హోమ్‌లో సీఎం రేవంత్ రెడ్డి

అదే దారిలో రాష్ట్ర మంత్రులు!



హైదరాబాద్, మార్చి 21 (ప్రభాత ఉదయం): నిత్యం సందర్శకులతో కలకలలాడే సచివాయలం ఒక్కసారిగా బోసిపోయింది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సాధారణ ప్రజలను కూడా నిర్ణీత వేళల్లో సచివాలయంలోనికి అనుమతిస్తున్న విషయం విధితమే. కానీ లోక్‌సభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం నుంచి షెడ్యూల్ వెలువరించడంతో ముఖ్యమంత్రితో సహా మంత్రులు ఎవ్వరూ సచివాలయానికి రావడం లేదు. దాంతో సందర్శకుల సంఖ్య ..మిగతా 2లో

## మోదీ సర్కార్‌కి ఈసీ ఝలక్

వికసిత్ భారత్ మెసేజ్‌లు ఆపేయాలని ఆదేశం




న్యూఢిల్లీ, మార్చి 21 (ప్రభాత ఉదయం): కేంద్ర ప్రభుత్వం వాట్సాప్‌లో పంపుతున్న వికసిత్ భారత్ మెసేజ్‌లపై ఎన్నికల సంఘం సీరియస్ అయింది. వెంటనే ఆ సందేశాలు పంపడాన్ని ఆపేయాలని తేల్చి చెప్పింది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం నడుచుకోవాలని ఆదేశించింది. అంతే కాదు. దీనిపై పూర్తి స్థాయిలో ఓ రిపోర్ట్ తయారు చేసి సబ్మిట్ చేయాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖని ఆదేశించింది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కొన్ని నిబంధనల్ని పాటించాలని స్పష్టం చేసింది. ఇప్పటికే అమల్లో ఉన్న పథకాల గురించి ఈ మెసేజ్‌లలో ..మిగతా 2లో



## పకడ్బందీగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు


సీఎస్ శాంతి కుమారి

హైదరాబాద్, మార్చి 21 (ప్రభాత ఉదయం): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి సమర్థవంతంగా అమలు చేయడానికి వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై గురువారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. పోలీస్, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, అటవీ, రెవెన్యూ, రవాణా తదితర శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో ఏవిధంగానైతే పని చేశారో అదే స్ఫూర్తితో రానున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణలోనూ మరింత సమర్థవంతంగా పని చేయాలని ..మిగతా 2లో

## కేంద్రం ఫ్యాక్ట్ చెక్ యూనిట్‌పై పిటిషన్ వెంటనే ఆపేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు



న్యూఢిల్లీ, మార్చి 21 (ప్రభాత ఉదయం): కేంద్ర ప్రభుత్వం ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ఏర్పాటుని ఆపేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వదంతులు వ్యాప్తి చెందకుండా వాటిని అరికట్టేందుకు పరిధిలో ఓ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ఏర్పాటు చేస్తామని వెల్లడించింది. ఈ మేరకు ఓ నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. అయితే...సుప్రీంకోర్టు ఈ నోటిఫికేషన్‌ని నిలిపివేసింది. ఈ యూనిట్‌ని ఏర్పాటు చేసుకునేందుకు బాంబే హైకోర్టు అనుమతినిస్తూ ఇచ్చిన తీర్పుని కొట్టి వేసింది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పర్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం దీనిపై కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ సందర్భంగా భావ ప్రకటనా స్వేచ్ఛ గురించి ప్రస్తావించింది. స్టాండప్ ..మిగతా 2లో



## సుప్రీంకోర్టుకి క్షమాపణలు చెప్పిన పతంజలి సంస్థ

ఆ ప్రకటనలు ఆపేస్తామని వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 21 (ప్రభాత ఉదయం): పతంజలి ఆయుర్వేద ఎండీ ఆచార్య బాలకృష్ణ సుప్రీంకోర్టుకి క్షమాపణలు చెప్పారు. తప్పుదోవ పట్టించే ప్రకటనలపై ఇప్పటికే సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా మండి పడింది. దీనిపై సమాధానం చెప్పాలని ఆదేశించింది. ఈ విషయంలో పతంజలి స్పందించలేదు. ఫలితంగా మరోసారి ..మిగతా 2లో

# ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్ట్

**మొదటి పేజీ తరువాయి...**

లిక్కర్ కేసు విచారణలో భాగంగా తమ ఎదుట హాజరు కావాలని ఇప్పటివరకు 9 సార్లు సమన్లు జారీ చేశారు. అయినప్పటికీ వాటిని పట్టించుకోని కేజ్రీవాల్ విచారణకు హాజరు కాలేదు. ఢిల్లీ లిక్కర్ కేసు విచారణలో భాగంగా కేజ్రీవాల్ ఇంట్లో ఈడీ అధికారులు సోదాలు చేయడం, ఆయనను అరెస్ట్ చేయడంతో కేజ్రీవాల్ నివాసం వద్దకు భారీగా ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు, కార్యకర్తలు చేరుకున్నారు. దీంతో కేజ్రీవాల్ ఇంటి వద్ద హై టెన్షన్ వాతావరణం నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బలగాలను భారీగా మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇక ఈడీ సోదాల విషయం తెలుసుకున్న ఆప్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నేతలు భారీగా కేజ్రీవాల్ ఇంటికి క్యూ కట్టారు. అయితే కేజ్రీవాల్‌ను కలిసేందుకు.. ఆయనతో మాట్లాడేందుకు ఈడీ అధికారులు వారికి అనుమతి ఇవ్వలేదు. దీంతో కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసేందుకు ఈడీ సిద్ధమైందని ఆరోపిస్తున్నారు. ఇక ఢిల్లీ సీఎం నివాసంలో ఈడీ సోదాలను పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఖండించారు. ఈ కేసులో తనను ఈడీ అధికారులు అరెస్ట్ చేయకుండా రక్షణ కల్పించాలని కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టును గురువారం ఆశ్రయించగా.. అక్కడ ఎదురు దెబ్బ తగిలింది. ఈడీ విచారణకు తాను సిద్ధంగా ఉన్నానని.. కానీ తనను అరెస్ట్ చేయరని హామీ ఇవ్వాలని కోర్టుకు కేజ్రీవాల్ విన్నవించుకున్నారు. అయితే అలా ఈడీ అధికారులకు ఆదేశాలు ఇవ్వలేమని కోర్టు తేల్చి చెప్పింది. ఈ క్రమంలోనే ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై ఆప్ నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.






## వర్క్ ఫ్రమ్ హోమ్‌లో సీఎం రేవంత్ రెడ్డి

**మొదటి పేజీ తరువాయి...**

గణనీయవంగా తగ్గిపోయింది. పీసీసీ అధ్యక్షుడు కూడా అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల కోడ్ నేపథ్యంలో సచివాలయానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు సచివాలయానికి రావద్దని ఆయన నిర్ణయించుకున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. అలాగే, మంత్రులు కూడా సచివాలయానికి రావడం లేదు. మంత్రులు తమ తమ జిల్లాల్లో ఎన్నికల ప్రచారంలో బిజీ అయ్యారు. ప్రభుత్వానికి సంబంధించిన రోజూ వారీ వ్యవహారాలను తమ ఇళ్ల నుంచే పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు అందుబాటులో లేకపోవడంతో సాధారణ ప్రజలు, సందర్శకులు సచివాయలంలో కనిపించడం లేదు. సాధారణంగా సందర్శకులకు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయంలోనికి అనుమతి ఉంటుంది. అయితే, మంత్రులను కలుసుకోడానికి వచ్చే ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర నాయకులకు ఆ నిబంధన వర్తించబోదు. కానీ ఎవరైనా మంత్రులను కలుసుకోడానికి ప్రత్యేక అనుమతి తీసుకుంటే సాధారణ వేళల్లోనూ మంత్రుల పేషీ నుంచి భద్రతా సిబ్బందికి సమాచారం వస్తుంది. అప్పుడే వారిని లోనికి అనుమతిస్తారు. కాగా, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులను కలుసుకోడానికి యధావిధిగా అనుమతి ఉంది. అయినప్పటికీ ఎన్నికల కోడ్ పరిమితుల దృష్ట్యా అన్ని పనులు అవ్వడం లేదని భావించి ఎక్కువ మంది సందర్శకులు సచివాలయానికి రావడం మానేశారు. దీంతో సచివాలయానికి భారీగా రద్దీ తగ్గింది. మరోవైపు, రాష్ట్రంలో నెలకొన్న ఆయా సమస్యలు, జరుగుతున్న పరీక్షలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఎప్పటికప్పుడు సచివాలయం కేంద్రంగా అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. అలాగే పగడ్బందిగా ఎన్నికల నిర్వహణకు ఉన్నతాధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష నిర్వహించారు.




## ఖాతాలను బ్లాక్ చేశారు

### కాంగ్రెస్ ఆవేదన

న్యూఢిల్లీ, మార్చి 21 (ప్రభాత ఉదయం): లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీకి కొత్త కష్టాలు ఎదురవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఖాతాలను స్తంభింపజేసి ఎన్నికల్లో తమకు డబ్బులు లేకుండా దెబ్బతీయాలని బీజేపీ చూస్తోందని పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. ఇది ప్రజాస్వామ్యంపై అతి పెద్ద దాడి అని సోనియా గాంధీ అభివర్ణించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని బీజేపీ సర్కార్‌పై కాంగ్రెస్ నేతలు తీవ్ర విమర్శలు చేశారు. మల్లికార్జున ఖర్గే మీడియాతో మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ ఉండాలి. బీజేపీ పెద్ద ఎత్తున రాజకీయ చందాలు వసూలు చేసింది. కానీ, వారు మా పార్టీ ఖాతాలను స్థంభింపజేశారు. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. మా బ్యాంకు ఖాతాలను తక్షణమే ఆపరేట్ చేసేందుకు అనుమతించాలి. బీజేపీ అన్ని వనరులపై ఏకఛత్రాధిపత్యం వహిస్తోంది. మాకు డబ్బు లేకుండా చేసి ఎన్నికల్లో దెబ్బతీయాలని చూస్తున్నారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోనియా గాంధీ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారు. నెల కిందట కాంగ్రెస్ అకౌంట్లను అక్రమంగా సీజ్ చేశారు. ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా కాంగ్రెస్‌కు 11 శాతం ఫండ్స్ మాత్రమే వచ్చాయి. ఫండ్స్‌ను కట్టడి చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. కేంద్రం తీరును తీవ్రంగా ఖండిస్తున్నాం. ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా బయటపడ్డ సమాచారంపై విచారణ జరగాల్సిందే. బీజేపీకి వచ్చిన బాండ్స్‌పై విచారణ జరగాలి. కాంగ్రెస్‌ను ఆర్థికంగా దెబ్బకొట్టాలని బీజేపీ చూస్తోంది. రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు సంబంధించిన అన్ని అకౌంట్లు ఫ్రీజ్ చేశారు. మా దగ్గర ఫండ్స్ లేవు. కాంగ్రెస్‌ను ఆర్థికంగా దెబ్బ కొట్టాలని చూస్తున్నారు. ఈసీ దీనిపై స్పందించడం లేదు. దేశంలో 20 శాతం ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారు. 14 లక్షల రూపాయలకు సంబంధించిన లెక్కల వివాదంపై మొత్తం కాంగ్రెస్ పార్టీ ఖాతాలను స్తంభింప చేశారు. రూ.200 కోట్లు జరిమానా వేశారు. ఆలస్య చెల్లింపుకు రూ.10వేలకు మించి జరిమానా వేయకూడదు. ప్రధానమంత్రి క్రిమినల్ చర్యలకు పాల్పడుతున్నారు. డబ్బులు లేకపోవడంతో ప్రచారాలు బుక్ చేసుకోలేకపోతున్నాం. మా అభ్యర్థులకు సహాయపడలేకపోతున్నాం. విమాన టికెట్లు కాదు, కనీసం రైల్వే టికెట్లు కొనలేకపోతున్నాం. ఈ అంశంపై దేశంలోని రాజ్యాంగ సంస్థలు, ప్రజలు స్పందించాలి అని కోరారు. అజయ్ మాకెన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఖాతాల స్తంభన ప్రజాస్వామ్యంపైన దాడి వంటిది. మా ఖాతాలో ఉన్న రూ.285కోట్ల రూపాయలను ఖర్చు చేయలేకపోతున్నాము. ఐదు వారాల నుంచి ఎన్నికల్లో ప్రచారం కోసం ఖర్చు చేయడానికి నిధులు లేకుండా చేశారు. 30ఏళ్ల కిందటి లెక్కలను ఆధారం చేసుకుని ఇప్పుడు మా ఖాతాలను ఎలా స్పందింప చేస్తారు. అన్ని రాజకీయ పార్టీలకు మినహాయింపు ఉన్నట్టు మేము మినహాయింపులు పొందాము. కానీ, సరిగ్గా ఎన్నికల ముందు మా ఖాతాలు నన్ను స్తంభింపచేశారు. ఆదాయం పన్ను చట్టం 230ఎఫ్ ప్రకారం ఆలస్య చెల్లింపులకు 10 వేలకు మించి జరిమానా వేయకూడదు. 210 కోట్ల రూపాయల పెనాల్టీ వేశారు. ఇదెక్కడి ప్రజాస్వామ్యం అని ప్రశ్నించారు.

## ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు పరార్

హైదరాబాద్, మార్చి 21 (ప్రభాత ఉదయం): గత ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల ఫోన్లు టాప్ చేసినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రణీత్ రావు వ్యవహారం అనేక మలుపులు తిరుగుతోంది. ఫోన్ ట్యాపింగ్‌లో ప్రణీత్‌కు అండగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు అమెరికా వెళ్లిపోయినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే తాను సమాచారాన్ని ధ్వంసం చేశానని ప్రణీత్‌రావు వెల్లడించిన సంగతి తెలిసిందే. 2018 నుంచే అక్రమ ట్యాపింగ్ దందా మొదలైనట్లు పోలీసులు గుర్తించారు. ఇజ్రాయిల్ నుంచి అత్యాధునిక ఉపకరణాలు ఖరీదు చేయగా, రామ్ గోపాల్ కన్సల్టెంట్, అడ్వైజర్‌గా వ్యవహరించారు. ఆదిలాబాద్ ఘర్షణ సమయంలో అక్కడ వినియోగించినట్లు గుర్తించారు. ప్రణీత్‌రావు కేసులో మరో నలుగురికి నోటీసులు జారీ చేశారు. కాగా, మాజీ ఐపీఎస్, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావు బంధువే ఈ ప్రణీత్ రావు. ప్రణీత్ కెరీర్‌లో అడుగడుగునా ప్రభాకర్ రావు అండగా ఉన్నట్లు సమాచారం. ప్రభాకర్ రావు నల్గొండ ఎస్పీగా ఉన్నప్పుడే ప్రణీత్ ప్రొబేషన్ క్లియరెన్స్ అయ్యింది. అలాగే.. ప్రభాకర్ రావు ఎస్ఐబీ చీఫ్ కాగానే.. ప్రణీత్‌కు ఎస్ఐబీలో పోస్టింగ్ లభించింది. ఇదిలా ఉంటే.. ఎస్ఐబీలో ఉన్న ఇతర ఇన్‌స్పెక్టర్లను కాదని ప్రణీత్‌ను వెనకేసుకొచ్చాని ప్రభాకర్‌పై ఆరోపణలు కూడా ఉన్నాయి. అందులో భాగంగానే నిబంధనలకు విరుద్ధంగా ప్రణీత్‌కు డీఎస్పీగా ప్రమోషన్ ఇప్పించారని ప్రభాకర్ బలమైన ఆరోపణ కూడా ఒకటి ఉండడం గమనార్హం.

## తమిళనాడు గవర్నర్‌కి సుప్రీంకోర్టు అక్షింతలు

### ఆయన తీరేమీ బాలేదంటూ ఆగ్రహం

న్యూఢిల్లీ, మార్చి 21 (ప్రభాత ఉదయం): తమిళనాడు గవర్నర్ రవిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవల నేరారోపణలు ఎదుర్కొని మంత్రి పదవి నుంచి తప్పుకున్న డీఎమ్‌కే నేతని మళ్లీ మంత్రిగా నియమించడంలో జాప్యం జరగడంపై మండి పడింది. గవర్నరే రాజ్యాంగాన్ని అనుసరించకపోతే ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించింది. డీఎమ్‌కే నేత కే పొన్ముడిని మళ్లీ మంత్రిగా నియమించేందుకు ఒకరోజు గడువునిచ్చింది. ఈ గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి, గవర్నర్‌కి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే పొన్ముడి నియామకాన్ని రవి పట్టించుదకోకపోవడంపై ప్రభుత్వం అసహనం వ్యక్తం చేసింది. ఇది రాజ్యాంగ విరుద్ధమని మండి పడింది. గవర్నర్ తీరుని నిరసిస్తూ సుప్రీంకోర్టుని ఆశ్రయించింది. ఆస్తుల కేసులో పొన్ముడి సభ్యత్వంపై వేటు పడింది. మద్రాస్ హైకోర్టు ఆయన సభ్యత్వాన్ని రద్దు చేసింది. అంతే కాదు. రెండేళ్ల జైలుశిక్ష కూడా విధించింది. అయితే...ఆ తరవాత ఈ కేసు సుప్రీంకోర్టు వరకూ వెళ్లింది. ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని తోసిపుచ్చిన సర్వోన్నత న్యాయస్థానం ఆ తీర్పుని నిలిపివేసింది. ఈ మేరకు ఆయనను మళ్లీ మంత్రిగా నియమించాలని గవర్నర్‌ని విజ్ఞప్తి చేసింది. అయితే..ఆయన నుంచి ఎలాంటి స్పందన రాలేదు.



## మల్కాజిగిరిలో కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందే

**మొదటి పేజీ తరువాయి...**

ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలవాలి.. హెలీ పండగలోగా అధిష్టానం అభ్యర్థులను ప్రకటిస్తుంది. కష్టపడిన వారిని ప్రభుత్వంలో భాగస్వాములను చేసే బాధ్యత నాది. మనకుబలమైన నాయకత్వం ఉంది.. సమన్వయంతో ముందుకెళ్ళాల్సిన అవసరం ఉంది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసిన అభ్యర్థులు ఒక ఐదుగురు సభ్యులతో కమిటీ వేసుకోవాలి. వారికి పోలింగ్ బూత్ ల వారీగా పని విభజన చేసుకుని సమీక్ష చేసుకోవాలి. నేడు సాయంత్రం కంటోన్మెంట్ లో కార్యకర్తల సమావేశం నిర్వహించుకోవాలి. ఉదయం 7 గంటలకే నాయకులు బస్తీ బాట పట్టాల్సిందే.. ప్రణాళికబద్ధంగా ప్రచారం నిర్వహించుకోవాలి.. మల్కాజిగిరి క్యాంపెయిన్ మోడల్ రాష్ట్రమంతా అనుసరించేలా నిర్వహించాలి. ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకం. మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నిక అభ్యర్థిది కాదు%ొా% ముఖ్యమంత్రిది.. నా బలం.. నా బలగం మీరే. ఎట్టి పరిస్థితుల్లో మల్కాజిగిరిలో కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందే..' అని ఆయన వ్యాఖ్యానించారు.

## మోదీ సర్కార్‌కి ఈసీ ఝలక్

**మొదటి పేజీ తరువాయి...**

ప్రస్తావించడాన్ని తప్పుబట్టింది. వికసిత్ భారత్ పేరుతో మోదీ ప్రభుత్వం అందరి వాట్సాప్‌లకు మెసేజ్‌లు పంపుతోంది. అందులో ఓ ఫైల్ కూడా ఉంటోంది. ఇప్పటి వరకూ కేంద్రం చేసిన అభివృద్ధిని ప్రస్తావించడంతో పాటు ఫీడ్‌బ్యాక్, సలహాలు సూచనలు ఏమైనా ఉంటే అందులో నింపాలని కోరుతూ మెసేజ్‌లు పంపుతోంది. వీటిని వెంటనే ఆపేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. అయితే...ఈ ఆదేశాలపై ఐటీ శాఖ స్పందించింది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి రాకముందే ఈ మెసేజ్‌లు పంపామని వివరించింది. నెట్‌వర్క్ లిమిటేషన్స్ కారణంగా కొందరి ఆలస్యంగా డెలివరీ అవుతున్నాయని చెప్పింది. మార్చి 16వ తేదీన ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని...అయితే అంతకు ముందు రోజు అంటే మార్చి 15వ తేదీనే ఈ మెసేజ్‌లు పంపినట్టు వివరణ ఇచ్చింది ఐటీ శాఖ. ఇప్పటికే ఈ మెసేజ్‌లపై రాజకీయ దుమారం రేగుతోంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు ఇలాంటివి ఎలా పంపుతారంటూ ప్రతిపక్షాలు వాదించాయి. కేరళ కాంగ్రెస్ దీనిపై వరుస పెట్టి సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెట్టింది. ప్రభుత్వం అధీనంలో ఉన్న డేటాబేస్‌ని మోదీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని, మెసేజింగ్ యాప్‌ని రాజకీయ ప్రచారాల కోసం వాడుకుంటోందని మండి పడింది. ఈ పోస్ట్‌లకు మెటా అకౌంట్‌ని ట్యాగ్ చేసి ప్రశ్నలు సంధిస్తోంది. వికసిత్ భారత్ పేరిట ఉన్న వాట్సాప్ వెరిఫైడ్ అకౌంట్ నుంచి ఆటోమేటెడ్ మెసేజ్‌లు రావడంపై అసహనం వ్యక్తం చేసింది. ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ కోరుతున్న పార్టీ అందులో పంపడంపై మండి పడింది. ఇదంతా కేవలం ప్రచారమే అని విమర్శిస్తోంది. ఎన్నికల సంఘం దీనిపై దృష్టి సారించాలని డిమాండ్ చేసింది. టెక్నాలజీని అడ్డం పెట్టుకుని ఇలాంటి ప్రచారం చేయడం ఏంటని ప్రశ్నించింది. ఈ క్రమంలోనే ఎన్నికల సంఘం ఈ మెసేజ్‌లపై ఫోకస్ పెట్టింది. ఎన్నికల కోడ్‌ని దృష్టిలో పెట్టుకుని వెంటనే ఆపేయాలని స్పష్టం చేసింది.

## సుప్రీంకోర్టుకి క్షమాపణలు చెప్పిన పతంజలి సంస్థ

**మొదటి పేజీ తరువాయి...**

అసహనం వ్యక్తం చేసింది సుప్రీంకోర్టు. ఈ క్రమంలోనే ఆచార్య బాలకృష్ణతో పాటు యోగా గురు రామ్ దేవ్ బాబాకి నోటీసులు పంపింది. ఈ నోటీసులపై స్పందిస్తూ ఆచార్య బాలకృష్ణ క్షమాపణలు చెప్పారు. పతంజలి ఉత్పత్తుల్లో ఔషధ గుణాలున్నాయని తప్పుడు ప్రచారం చేసుకోవడంపై సుప్రీంకోర్టు మందలించింది. ఈ మేరకు ఆచార్య బాలకృష్ణ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. చట్టంపైన తనకు గౌరవముందని అందులో తెలిపారు. ఇప్పటి వరకూ జరిగిన ఆలస్యానికి క్షమాపణలు చెప్పారు. భవిష్యత్‌లో అలాంటి ప్రకటనలు చేయమని కోర్టుకి వెల్లడించారు. దేశ ప్రజలు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని తప్ప మరో ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు. అది మాత్రమే చెప్పి పతంజలి ఉత్పత్తులను విక్రయించినట్టు తెలిపారు. ప్రాచీన గ్రంథాల్లో ఏముందో వాటి ఆధారంగానే ఈ ఉత్పత్తులను తయారు చేసినట్టు వివరించారు. ఆయుర్వేద పరిశోధనలు చేసినట్టు వెల్లడించారు. ఆయుర్వేదంపై పరిశోధనలు పెద్దగా లేనప్పుడు లో ప్రొవిజన్స్ చేర్చారని వివరించారు. ప్రస్తుతానికి ఆయుర్వేదంలో క్లినికల్ రీసెర్చ్‌లు జరుగుతున్నాయని, తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని తెలిపారు. కొన్ని వ్యాధులకు ఎలాంటి మందులు వినియోగించాలో అధ్యయనం చేసినట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు ఆచార్య బాలకృష్ణ. 2006లో ఆచార్య బాలకృష్ణ, యోగా గురు రామ్ దేవ్ బాబా ఇద్దరూ కలిసి ప్రారంభించారు. ఆయుర్వేదం ఆధారంగా తయారు చేసిన ఉత్పత్తులని విక్రయిస్తూ వస్తున్నారు. అందులో ఎన్నో ఔషధ గుణాలున్నట్టు ప్రచారం చేస్తున్నారు. ఇదే సుప్రీంకోర్టు అసహనానికి కారణమైంది. గోరంత దాన్ని కొండంత చేసి చెప్పుకోవడం సరికాదని స్పష్టం చేసింది. అంతకు ముందు రోజే పతంజలి తీరుపై మండి పడింది. ఆచార్య బాలకృష్ణతో పాటు రామ్ దేవ్ బాబాని కోర్టులో హాజరు కావాలని ఆదేశించింది. ఈ ఆదేశాలనూ పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

## కాంగ్రెస్‌లో జూనియర్‌ని నేనెలా సీఎం అవుతా

**మొదటి పేజీ తరువాయి...**

బాధ్యులను వదలబోమని మంత్రి స్పష్టం చేశారు. ధరణి ద్వారా జరిగిన అక్రమాలన్నింటినీ ఆధారాలతో బయటపెట్టి, శ్వేతపత్రం విడుదల చేస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గత సర్కారు ధరణిని రహస్య డాక్యుమెంట్‌గా చూసిందని, తమ ప్రభుత్వం ఏదీ దాచి పెట్టదన్నారు. ధరణిలో ప్రజలకు ఇబ్బంది కలిగించే విషయాలను తొలగించి, మంచి వాటిని కొనసాగిస్తామన్నారు. నేడో, రేపో 5 ఎకరాల వారికి రైతుబంధు పూర్తవుతుందని మంత్రి పొంగులేటి తెలిపారు. రిజిస్ట్రేషన్ల శాఖను కూడా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని పొంగులేటి పేర్కొన్నారు. విద్యుత్ సమస్య నుంచి బయటపడ్డామని, మంచినీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. వేసవిలో మంచి నీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్తలను గత ప్రభుత్వం తీసుకోలేదని.. పైగా తమపై రాళ్లు వేస్తున్నారని పొంగులేటి మండిపడ్డారు. తమ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేసే ప్రసక్తే లేదని చెప్పారు. మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డితో చర్చించి జర్నలిస్టుల సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా 14 స్థానాలు గెలుస్తుందని, ఇప్పుడున్న పరిస్థితుల్లో బీఆర్ఎస్‌కు ఒకటో, రెండో వస్తే అదే గొప్ప అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పుకొచ్చారు. తాను బీజేపీ సహా ఏ ఇతర పార్టీలతో టచ్‌లో లేనని పొంగులేటి స్పష్టం చేశారు. అంతేగాక, పార్లమెంటు ఎన్నికల తర్వాత తానే సీఎం అనడం ఊహాజనితమని మంత్రి పొంగులేటి అన్నారు. తాను సీఎం కావాలని కోరుకోవడం లేదని, అలాంటి ఆలోచనే లేదని స్పష్టం చేశారు. రోజూ సీఎంతో ఉంటే సీఎంను అవుతానా? ఆశకూ ఓ హద్దుండాలే అని వ్యాఖ్యానించారు. కాగా, ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి రమ్మని ఎవరినీ అడగడం లేదని, గేట్లు ఎత్తితే వరదేనన్నారు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. కొందరు ఇతర పార్టీల నేతలు స్వచ్ఛందంగా వస్తున్నారని తెలిపారు. రాష్ట్ర హక్కుల కోసం కేంద్రంతో పోరాటం చేసేందుకు సిద్ధమని చెప్పారు.

## కేంద్రం ఫ్యాక్ట్ చెక్ యూనిట్‌పై పిటిషన్ వెంటనే ఆపేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు

**మొదటి పేజీ తరువాయి...**

కమెడియన్ కునాల్ కమ్రా, ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా కేంద్రం ప్రకటనను వ్యతిరేకిస్తూ బాంబే హై కోర్టులో పిటిషన్ వేశాయి. కేంద్ర ప్రభుత్వం ఫ్యాక్ట్ చెక్ యూనిట్‌ని ఏర్పాటు చేయకుండా అడ్డుకోవాలని కోరింది.గతేడాది కేంద్ర ప్రభుత్వం ఐటీ చట్టంలో కీలక సవరణలు చేసింది. ఈ కొత్త నిబంధనల ప్రకారం వదంతుల వ్యాప్తిని అడ్డుకునేందుకు కేంద్రం ప్రత్యేకంగా ఓ యూనిట్‌ని ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించింది. ప్రభుత్వానికి సంబంధించిన కీలక వివరాలను తప్పుదోవ పట్టించినా, తప్పుడు ప్రచారం చేసినా ఈ యూనిట్ వాటిపై ఫ్యాక్ట్ చెక్ చేస్తుందని తెలిపింది. ఆ మేరకు ఆయా సోషల్ మీడియా సంస్థల్ని అప్రమత్తం చేస్తామని స్పష్టం చేసింది. ఆయా అకౌంట్స్‌ని తొలగించేందుకూ ఇది వీలు కల్పిస్తుందని వెల్లడించింది.

## పకడ్బందీగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు

**మొదటి పేజీ తరువాయి...**

సూచించారు. రాష్ట్రంలో సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులలో ప్రత్యేకంగా చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణ, ప్రవర్తనా నియమావళి అమలుపై అన్ని ప్రధాన శాఖల్లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికీ వివిధ శాఖల ద్వారా చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని వెల్లడించారు. వీటిలో పోలీస్ శాఖ ద్వారా 444 చెక్ పోస్టులుండగా, 9 అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులున్నాయని తెలిపారు. ఇప్పటివరకు పోలీసుల తనిఖీల్లో రా రూ. 10 కోట్లు పట్టుబడ్డాయన్నారు. లైసెన్స్ లేని ఆయుధాలు, పేలుడు పదార్థాలు, జిలెటిన్ స్టిక్స్, బంగారాన్ని కూడా స్వాదీన పర్చుకున్నామని తెలిపారు. రవాణా శాఖ ద్వారా 15 చెక్ పోస్టులు, 52 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ చెక్ పోస్టులు 24 గంటలు పనిచేస్తాయని తెలిపారు. రవాణా శాఖ బృందాలు జరిపిన తనిఖీల్లో రూ. 34 .31 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వాణిజ్య పన్నుల శాఖ ద్వారా 16 అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం తోపాటు 31 స్ట్రాటెజిక్ పాయింట్లపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. వీటితోపాటు, ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వివిధ వస్తువులను పంచేందుకు అవకాశమున్న 25 గోదాములను గుర్తించి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచామని వెల్లడించారు. వీటితోపాటు 141 గోదాములు, 912 వివిధ వస్తువుల తయారీ గోదాములపై కూడా నిఘా ఉంచామని పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖ ద్వారా 21 అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులు, ఆరు మొబైల్ చెక్ పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు, అక్రమ మద్యం తయారీకి అవకాశం ఉన్న ఎనిమిది జిల్లాలను గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి సాధించామని సీఎస్ తెలిపారు. మద్యం అక్రమ రవాణాకు అవకాశమున్న ఐదు రైలు మార్గాలను గుర్తించి వాటి నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటివరకు రూ. 50 లక్షల విలువైన మద్యాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని డిస్టిలరీలపై ప్రత్యేక నిఘా ఉంచామని, సీసీటీవీలను ఏర్పాటు చేసి డిస్టిలరీస్ ద్వారా మద్యం సరఫరాను పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్‌లోని పోలీస్ శాఖకు చెందిన పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రం నుండి కూడా మద్యం రవాణాపై సీసీటీవీల ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించినట్టు తెలిపారు. అటవీ శాఖ ద్వారా కూడా 65 చెక్ పోస్టులు ఏర్పాటు కాగా దీనిలో 18 అంతర్ రాష్ట్ర చెక్



పోస్టులు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయడానికి అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని శాంతి కుమారి తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో డీజీపీ రవీ గుప్తా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, పీసీసీఎఫ్ దొబ్రియల్, హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, అడిషనల్ డీజీ ఎస్‌కే జైన్, రవాణా శాఖ కార్యదర్శి శ్రీనివాస రాజు, వాణిజ్య పన్నుల శాఖ కమీషనర్ టీకే శ్రీదేవి, ఎక్సైజ్ శాఖ కమిషనర్ శ్రీధర్, సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌లో

# కృత్రిమ మేధస్సుపై అంతర్జాతీయ సదస్సు

బుద్వేల్, మార్చి21(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్(ఎన్ ఐ ఆర్ డీ పీ ఆర్) లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ) పై రెండు రోజుల అంతర్జాతీయ స్కోపింగ్ వర్క్‌షాప్‌ను నిర్వహించింది. గ్రామీణాభివృద్ధి, పంచాయితీ రాజ్‌కు అంకితమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రీసెర్చ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడానికి ఈ సదస్సులో చర్చించారు. ఈ వర్క్‌షాప్ లో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ, ప్రాథమిక విద్య, పథకం అమలు, ఆడిట్ ప్రక్రియలు మరియు గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్థిక అంశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అప్లికేషన్‌లతో సహా కీలకమైన నేపథ్య రంగాలపై చర్చకు వచ్చింది. అమెరికా, బెల్జియం, భారతదేశానికి చెందిన విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు, విధాన నిపుణులతో సహా ప్రఖ్యాత జాతీయ, అంతర్జాతీయ నిపుణులు ఈ కార్యక్రమంలో తమ అభిప్రాయాలను, నైపుణ్యాన్ని పంచుకున్నారు. వారి సహకారం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అభివృద్ధికి సిఫార్సులను రూపొందించింది. వర్క్‌షాప్‌లో వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, అధ్యాపకులు మరియు విద్యార్థి సంఘాల నుండి సుమారు 30 మంది విద్యా నిపుణులు చురుకుగా పాల్గొనడం, నిపుణుల ప్యానెల్‌లతో పాటు చర్చలను సుసంపన్నం చేయడం జరిగింది. ఎన్ ఐ ఆర్డీ పీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్. జి. నరేంద్ర కుమార్ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు, కార్యాచరణ సామర్థ్యం, ప్రభావం, జవాబుదారీతనం మెరుగుపరచడానికి గ్రామీణాభివృద్ధి పంచాయతీ రాజ్ లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యొక్క కీలక పాత్రను నొక్కిచెప్పారు, చివరికి మెరుగైన సేవా బట్వాడా మరియు ప్రజల విశ్వాసాన్ని పెంచారు. కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ చంద్ర శేఖర్ కుమార్, పంచాయత్ రాజ్ సిస్టమ్స్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాముఖ్యతను ప్రస్తావించారు. విశ్రాంత ఐ ఏ ఎస్ అధికారి ప్రకాష్ కుమార్ , డాక్టర్ ఈ జీ రాజన్, పెంటగ్రామ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్, ప్రొఫెసర్ కె ఎస్ రాజన్, ప్రొఫెసర్ రవీంద్ర ఎస్ గావలి, డాక్టర్ ఎం.వి. రవిబాబు లు పాల్గొన్నారు.



సదస్సు ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్ కుమార్, ఎన్ ఐ ఆర్ డీ పీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సి. నరేంద్ర కుమార్, తదితరులు



కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న హెల్త్ విభాగం సిబ్బంది

## 'కుష్టు వ్యాధి నిర్మూలనకు సహకరించాలి'

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధి మైలార్దేవ్పల్లి డివిజన్ మార్కండేయ నగర్లో ఉన్న శివరాంపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎల్ఎ డాక్టర్ అరుణ మాట్లాడుతూ.. వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఆశాల ద్వారా ఇంటింటికీ తిరిగి వ్యాధిగ్రస్థులను గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నామన్నారు.

## సైబరాబాద్ ఎస్ఓటి పోలీసుల ఆధ్వర్యంలో బెల్ట్ షాపులపై దాడులు

రాజేంద్రనగర్, మార్చి21(ప్రభాత ఉదయం) : సైబరాబాద్ కమిషనరేట్ పరిధి లో ఎస్ ఓ టీ బృందాలు 8 పోలీస్ స్టేషన్ ల ప్రాంతాల్లోని అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాప్ లపై గురువారం దాడి చేసి 796.05 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.7,47,368 లు ఉంటుందని తెలిపారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే 480 లీటర్స్ మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తుండగా ఎస్ ఓ టీ మేడ్చల్ టీమ్ పట్టుకోవడం జరిగింది.

**పోలీస్ స్టేషన్ల వారీగా :**

మోకిలా లో 45.2 లీటర్లు, రాజేంద్రనగర్ లో 94..78 లీటర్లు, పేట్ బషీరాబాద్ లో – 480 లీటర్లు, శామీర్‌పేట్ లో 11.25 లిటర్లు, బాచుపల్లి లో 55.8 లీటర్లు, మైలార్‌దేవ్‌పల్లి లో 17.4 లీటర్లు, నందిగామ లో – 19.14 లీటర్లు, దుండిగల్ లో 6.43 లీటర్ల చొప్పున స్వాధీనం చేసుకున్నారు.



ముఖ్య కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న రాజేంద్రనగర్ డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి

## చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగురవేస్తాం: పోరెడ్డి ధర్మారెడ్డి

రాజేంద్రనగర్, మార్చి21(ప్రభాత ఉదయం) చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగురవేస్తామని రాజేంద్రనగర్ డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి అన్నారు. గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఉప్పరపల్లిలోగల బిఆర్ఎస్ ఆరాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశం లో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా పోరెడ్డి ధర్మారెడ్డి మాట్లాడుతూ... రాబోయే ఎలక్షన్లో ఏ విధంగా పార్టీ కోసం పనిచేయాలని దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలోబి ఆర్ ఎస్ నాయకులు ప్రీతం సుబ్బారావు, ముజామిల్ ,యాదమ్మ యాదవ్ ,సుజాత, సుమలత ,సాయి గౌడ్, రవీందర్ ,దాస్ మహేందర్, భాను, ప్రసాద్, గిరి ,రాజేష్, సందీప్ రెడ్డి, అశ్వక్, శివ గౌడ్, శివ ,యశోద, అండాలు ,రజియా సుల్తానా, ప్రదీప్, ఆదిత్య, దీపక్, శ్రావణ్ ,తదితర నాయకులు పాల్గొన్నారు



పట్టు బడ్డ నగదు వివరాలను వెల్లడిస్తున్న రాజేంద్రనగర్ ఏసీపీ టి శ్రీనివాస్, ఇన్స్ పెక్టర్ పి. మధు లు

## మైలార్‌దేవ్‌పల్లిలో రూ.17.4 లక్షలు సీజ్

బుద్వేల్, మార్చి21(ప్రభాత ఉదయం): మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ శాస్త్రపురం ఏరియాలో గురువారం వెహికల్ చెకింగ్ చేస్తుండగా ఆదిత్య అనే వ్యక్తి దగ్గర రూ. 17 లక్షల 40 వేల ఒక వంద రూపాయలు పట్టుకోవడం జరిగింది దీనికి సంబంధించిన ఎలాంటి రిసిప్ట్ గాని అకౌంట్ ఆధారాలు గాని లేకుండా తీసుకొని వస్తున్నందున ఎలక్షన్ కోడ్ ఉల్లంఘన కింద అట్టి నగదు ను స్వాధీనంపర్చుకోవడం అయినది. ఆదిత్య బృందావన్ కాలనీ లో వుంటాడు. ఇట్టి స్వాధీన పరుచుకున్న డబ్బులను తదుపరి చర్య నిమిత్తం రాజేంద్రనగర్ ఆర్డీఓ కార్యాలయంలో అప్పగించడమైనది.

## పార్లమెంటు చేవెళ్ల అభ్యర్థి రంజిత్ రెడ్డికు శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ నేత దొడ్ల రామకృష్ణ గౌడ్

కూకట్‌పల్లి,మార్చి21 (ప్రభాత ఉదయం) రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం అధిష్టానం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రంజిత్ రెడ్డి ని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన సందర్భంగా గురువారం ఆల్విన్ కాలనీ డివిజన్ బిఆర్ఎస్ యువ నాయకులు దొడ్ల రామకృష్ణ గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మేరకు రంజిత్ రెడ్డిని అంత్యత భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంటులో ప్రజా సమస్యలపై తన గళాన్ని వినిపించాలని కోరారు.



ఎంపీ రంజిత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామకృష్ణ గౌడ్




చల్లా నరసింహారెడ్డిని సన్మానిస్తున్న అత్తాపూర్ కాంగ్రెస్ నాయకులు

## శివారు మున్సిపాలిటీల మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తా

### చల్లా నరసింహారెడ్డి

రాజేంద్రనగర్, మార్చి21(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ చైర్మన్ గా నియమితులైన కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డిని అత్తాపూర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. గురువారం అత్తాపూర్ డివిజన్ కి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏం గోవర్ధన్ రెడ్డి, బండారు రమేష్, తదితరులు ఆయనను వృక్షాలు వద్ద సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.



ఎంపీ రంజిత్ రెడ్డికి మద్దతు తెలుపుతున్న మహిళ ప్రతినిధులు

## చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్ రెడ్డి గెలుపుకు మా వంతు సహకారం

### రంగారెడ్డి జిల్లా బ్లాక్ ఏ డివిజన్ కాంగ్రెస్ మహిళా ప్రెసిడెంట్ ఇందిరమ్మ

రాజేంద్రనగర్,(ప్రభాత ఉదయం):పార్లమెంట్ ఎన్నికల్లో మీ గెలుపుకు మా పాత్ర ఉంటుందని చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డికి మాట ఇవ్వడం జరిగిందని రంగారెడ్డి జిల్లా బ్లాక్ ఏ డివిజన్ కాంగ్రెస్ మహిళా ప్రెసిడెంట్ ఇందిరమ్మ గురువారం చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డిని రంగారెడ్డి జిల్లా బ్లాక్ ఏ డివిజన్ కాంగ్రెస్ మహిళా ప్రెసిడెంట్ ఇందిరమ్మ,మణికొండ కౌన్సిల్ పరిధి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు డాక్టర్ ఎన్.ప్రభావతి,ఉపాధ్యక్షురాల్లు సావిత్రి,మంజుల,ఖాజాగుడా డాక్టర్ సదానందం,మణికొండ డాక్టర్ నరేందర్ లు మర్యాదపూర్వకంగా కలవడం జరిగినదన్నారు.

## బండ్లగూడ జాగీర్ హస్తగతం..

# మేయర్‌పై నెగ్గిన అవిశ్వాస తీర్మానం



అవిశ్వాసంలో నెగ్గి మేయర్ గా ఎన్నికై విక్టరీ చూపిస్తున్న ఎం లత ప్రేమ్ గౌడ్



మేయర్ మహేందర్ గౌడ్ పై అవిశ్వాసం పెట్టిన డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి, కార్పొరేటర్లు

### ఓడిన మేయర్ మహేందర్ గౌడ్ కార్పొరేషన్ లో సమగ్ర అభివృద్ధి చేపడుతాం: మేయర్ లత ప్రేమ గౌడ్

రాజేంద్రనగర్, మార్చి21 (ప్రభాత ఉదయం) రాజేంద్ర నగర్ నియోజకవర్గం బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ లో అవిశ్వాసం అంకం గురువారంతో ముగిసింది.మేయర్ మహేందర్ గౌడ్ పై 16 మంది కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది.ఈ ఓటింగ్ లో మేయర్ కు వ్యతిరేకంగా 16 మంది కార్పొరేటర్లు మద్దతు పలికారు.దీంతో మేయర్ మహేందర్ గౌడ్ తన పదవిని కోల్పోయాడు. రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్ ఆర్డిఓ వెంకట్ రెడ్డి సమక్షంలో ఈ ఓటింగ్ నిర్వహించారు. ఇప్పటికే మేయర్ మహేందర్ గౌడ్ తన కార్పొరేటర్లు అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కానీ పదవి నిలువలేదు.త్వరలో సమావేశాన్ని నిర్వహించి మేయర్ ను ఎన్నుకోనున్నారు.మేయర్ గా ఇప్పటికే లతాప్రేమ్ గౌడ్ కు కార్పొరేటర్ అంతా మద్దతు పలకడం తెలిసిందే.జాగీర్ కార్పొరేషన్ లో అవిశ్వాసానికి చాలా అవాంతరాలు ఎదురయ్యాయి.ఓ దశలో సాంకేతిక కారణాలతో అవిశ్వాసాన్ని వీగిపోయేలా చేసే ప్రయత్నం జరిగింది.జాగీర్ లో అవిశ్వాసాన్ని అడ్డుకుంటున్న శక్తి ఎవరు? అని నిలదీసింది.దీంతో అవిశ్వాస తీర్మానం అనేక మలుపులు తిరిగింది.ఈ గురువారం చివరకు ఓటింగ్ వరకు వచ్చింది.

**పంతం నెగ్గింది..**

బండ్లగూడ జాగీర్ బీఆర్ఎస్ ఆధీనంలో ఉంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారి..కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఇక్కడ కూడా పరిణామాలు మారిపోయాయి.మేయర్ పనితీరుపై వ్యతిరేకత, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలో చేరితే ప్రగతి పనులు చేపట్టేందుకు పార్టీ మార్పు తప్పదని అత్యధిక శాతం కార్పొరేటర్ల అభిప్రాయం.ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం చురుగ్గా వ్యవహరించింది.జాగీర్ అసమ్మతి కార్పొరేటర్లకు అండగా నిలిచింది.జాగీర్ కార్పొరేషన్ లో అవిశ్వాసం వెనుక డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి క్రియాశీలక పాత్ర పోషించారు.రోజుల తరబడి క్యాంపు నిర్వహణను పర్యవేక్షించారు.చివరకు అవిశ్వాసం నెగ్గే వరకు ఆయన తెరవెనుక ఉండి కథ నడిపించారు.వాస్తవానికి గత నెల 22నే అవిశ్వాసంపై ఓటింగ్ జరగాల్సి ఉంది.కానీ,మేయర్ మహేందర్ గౌడ్ కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. అనంతరం నలుగురు కార్పొరేటర్లతో కలిసి కాంగ్రెస్ లో చేరారు.ఈ నేపథ్యంలో ఆయన పదవికి వచ్చిన ముప్పేమీ లేదని భావించారు.అయినా కూడా ఆయనను ఎట్టి పరిస్థితుల్లోనూ దించేయాలన్న మెజారిటీ కార్పొరేటర్ల పంతం నెగ్గింది.జాగీర్ కార్పొరేషన్ హస్తగతం కావడం వెనుక చేవెళ్ల ఎంపీ జి.రంజిత్ రెడ్డి కీలక పాత్ర పోషించారని తెలుస్తోంది.ఆయన బీఆర్ఎస్ లో ఉన్నప్పుడే జాగీర్ కార్పొరేషన్ కార్పొరేటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గారు. ఇటీవల ఎంపీ కూడా కాంగ్రెస్ లోనే చేరడంతో కథ సుఖాంతమైంది.

# పాల పైసల కోసం రైతుల ఎదురుచూపులు



గద్వాల్‌లోని పాల కేంద్రం



పాడి రైతు మల్ రెడ్డి- కిష్టంపల్లి

గద్వాల,మార్చి21(ప్రభాత ఉదయం)రైతుల నుంచి సేకరించిన పాలకు సకాలంలో బిల్లులు చెల్లించడంలో విజయ డెయిరీ అధికారులు జాప్యం చేస్తున్నారు. పాల బిల్లులు సకాలంలో అందక పాడి రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా ప్రతి 10 రోజులకోసారి పాల బిల్లులు చెల్లించాలి. కానీ గత కొంతకాలంగా పాల బిల్లులు చెల్లించడం లేదు. దాంతో పాటు రైతులకు అదనంగా లీటర్‌కు రూ.నాలుగు రూపాయలు చెల్లించడంతో ఎంతో ఉత్సాహంగా పాల ఉత్పత్తిపై ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపించారు. కాని విజయ డెయిరీ పాల కేంద్రం వారు రైతుల నుంచి కొనుగోలు చేసిన వాటిని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు విక్రయించడం, ఒప్పందాల్లో సమన్వయ లోపాల కారణంగానే బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కో రైతుకు సుమారు రూ.50 వేల నుంచి రు.3 లక్షల వరకు బకాయిలు చెల్లించాలి. ఈ లెక్కన జిల్లాలో మొత్తం రూ.50లక్షలు పైగా బకాయిలు పేరుకుపోయాయి. లక్షల రూపాయలు ప్రభుత్వం పాడి రైతులకు బకాయి ఉంటే రైతులు నష్టపోయే అవకాశం ఉందని గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైన పాడి రైతులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా బకాయిలను చెల్లించి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### ఆర్థికంగా నష్టపోతున్న పాడి రైతులు

జోగులాంబ గద్వాల్ జిల్లాలోని వివిధ గ్రామాలలో పాడి రైతులు గద్వాల్ లోని విజయడెయిరీ పాల శీతలకేంద్రానికి పాలు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. ప్రతిరోజు సుమారు 2,000 నుంచి 2,500 లీటర్ల వరకు పాలను విజయ పాల డెయిరీ కేంద్రానికి విక్రయిస్తారు, పాడి రైతుల నుంచి సేకరించిన పాలకు ఎస్ఎన్ఎఫ్, ఫ్యాట్ ద్వారా లీటరుకు రూ.50 నుంచి గరిష్ఠంగా రూ.55 వరకు ధర నిర్ణయిస్తారు. ఈ విధంగా పాల రైతులకు ప్రతి 10 రోజులకు ఒకసారి రూ. 10లక్షలకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే గద్వాల్ లోని విజయ పాల డెయిరీ సెంటర్ పరిధిలోని పాడి రైతులకు నాలుగు, అయిదు బిల్లులు బకాయి ఉన్నట్లు చెబుతున్నారు. అదేవిధంగా గత ప్రభుత్వం పాడి రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వానికి చెందిన విజయ డెయిరీకి పాలు పోస్తే అదనంగా లీటరుకు రూ.4 చెల్లిస్తామని చెప్పింది. కాని రూ.2 చొప్పున చెల్లిస్తుందని ఆరోపణలు. గద్వాల్ పాల శీతలీకరణ కేంద్రం ద్వారా పాడి రైతులకు చెల్లించాల్సిన మొత్తం రూ.40-50 లక్షల పైగానే ఉంటుంది.

### బిల్లులు చెల్లించాలి- మల్లారెడ్డి, కిష్టంపల్లి,వనపర్తి జిల్లా

కొన్ని సంవత్సరాలుగా పాడి పరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతున్నా. రోజూ 90 లీటర్ల పాలు విజయ డెయిరీకి అందజేస్తున్నా. క్రమం తప్పకుండా బిల్లులు రాక చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికే రెండు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు రెగ్యులర్‌గా రాకపోవడంతో పశువులకు అవసరమైన దాణా, ఇతర అవసరాలకు పెట్టుబడి లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వెంటనే బిల్లులు చెల్లించాలి.

### త్వరలో చెల్లిస్తాం -సురేష్ డీడీ, గద్వాల, విజయ డెయిరీ

జిల్లాలో పాడి రైతులకు ఫిబ్రవరి 10 నుంచి మార్చి 20 కాలానికి బిల్లులు చెల్లించాల్సిన మాట వాస్తవమే. జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.40 లక్షలకు పైగా సొమ్ము అందజేయాల్సి ఉంది. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే చెల్లిస్తాం.



# మల్కాజిగిరిలో మళ్లీ కాంగ్రెస్ జెండా ఎగరాలి: సునీతారెడ్డి

హైదరాబాద్, మార్చి 21(ప్రభాత ఉదయం) మల్కాజిగిరి సిట్టింగ్ పార్లమెంట్ లో మళ్లీ కాంగ్రెస్ జెండా ఎగరాలని జడ్పీ ఛైర్పర్సన్ సునీత మహేందర్ రెడ్డి ఈరోజు ఇన్చార్జులు, ముఖ్య నాయకులకు సూచించారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం సీఎం సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.



# ప్రైవేట్ క్లినిక్ మూసివేత


### అన్నిరకాల శస్త్రచికిత్సలతో అధికారుల సీరియస్ !

గద్వాల,మార్చి21(ప్రభాత ఉదయం)అర్హత లేకుండా వైద్యం చేస్తూ పేదల ఆరోగ్యాలతో ఆడుకుంటున్న కొందరు ఆర్ఎంపీ వైద్యులు ఆట కట్టిస్తున్నారు జిల్లా వైద్యాధికారులు. అయిజ మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలోని ఆర్ఎంపీ క్లినిక్ పై గురువారం గద్వాల జిల్లా వైద్యాధికారులు ఆకస్మిక దాడులు చేసి క్లినిక్ ను మూసివేశారు. తిమ్మారెడ్డి అనే వ్యక్తి ఉషా క్లినిక్ పేరుతో ఫస్ట్ఎయిడ్ వైద్యం చేయాల్సి ఉండగా, గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు వైద్యం చేస్తూ, యాంటీ బయాటిక్, స్టిరాయిడ్స్, పెయిన్ కిల్లర్స్,సిరప్స్, గ్లూకోజ్ బాటిల్స్ మందులను యధేచ్ఛగా విక్రయిస్తున్నారు. అంతే కాకుండా అక్రమంగా ఫిజీషియన్ శాంపుల్స్ మందులు విక్రయిస్తున్నారు. వీటితో పాటు గర్భ నిర్ధారణ కిట్స్, నెబిలైజర్ వాడుతూ, ప్రైవేట్ హాస్పిటల్ కు రెఫర్ చేసే స్లిప్ పేపర్స్ ను అధికారులు గుర్తించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ ప్రకారం తిమ్మారెడ్డి నిర్వహించే ఉషా క్లినిక్ కు అనుమతి లేదని, అందువల్లే మందులను సీజ్ చేసి, క్లినిక్ ను మూసివేసినట్లు జిల్లా ఉప వైద్యాధికారి సిద్ధప్ప, ప్రోగ్రాం ఆఫీసర్ స్రవంతి తెలిపారు.

# శంషాబాద్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేయాలి

### పీసీసీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జలపల్లి నరేందర్,శంషాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,కౌన్సిలర్ పిల్లనగ్రోవిల సంజయ్ యాదవ్

### మంత్రి పొన్నం ప్రభాకర్ కు వినతి పత్రం అందజేసిన నాయకులు



మంత్రి పొన్నం ప్రభాకర్ కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జల్ల పల్లి నరేందర్

శంషాబాద్,మార్చి 21, (ప్రభాత ఉదయం): ఎండలు ముదురు తొండడంతో బస్టాప్ లో నిలబడేందుకు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జలపల్లి నరేందర్,శంషాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,కౌన్సిలర్ పిల్లనగ్రోవిల సంజయ్ యాదవ్ తెలిపారు.గురువారం తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు శంషాబాద్ మున్సిపల్ బస్ స్టేషన్ ఆధునికరణ కోసం బెంగళూరు నేషనల్ హైవే పైన బస్ షెల్టర్ ల నిర్మాణానికై వినతి పత్రం ఇవ్వడం జరిగిందని రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జలపల్లి నరేందర్,శంషాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,కౌన్సిలర్ పిల్లనగ్రోవిల సంజయ్ యాదవ్,మంచాల గణేష్, ప్రసాద్,నాగరాజు,మనోహర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.గాంధీభవన్లో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ గా ఎన్నికైన ప్రీతంను ఫిషరీస్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మెట్టు సాయిని సన్మానం చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి బొబ్బిలి కృష్ణయ్య,శంషాబాద్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి నర్సింగ్ రావు,శంషాబాద్ మున్సిపల్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ రాచమల్ల జగన్,జయమ్మ, శేఖర్,రాచమల్ల గణేష్,తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీధర్ రెడ్డి జన్మదిన వేడుకలు

కూకట్‌పల్లి,మార్చి 21 (ప్రభాత ఉదయం) శేరిలింగంపల్లి నియోజకవర్గం, కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తి కంటెస్టెడ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు బస్తివాసులు హాజరై శ్రీధర్ రెడ్డిని శాలువాతో సత్కరించి, పూలమాలతో సన్మానించి, కేకు కట్ చేసీ శుభాకాంక్షలు తెలియజేశారు. సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ చిట్టి రెడ్డి శ్రీధర్ రెడ్డి నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆ భగవంతుని వేడుకుంటున్నామని అన్నారు . రాజకీయపరంగా మరెన్నో ఉన్నత పదవులను అధిరోహించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాపి రెడ్డి నగర్ బస్తి వాసులు ఉపేందర్, రమేష్ యాదవ్,కిరణ్, కిషోర్,రాజేష్, కూకట్ పల్లి డివిజన్ సీనియర్ నాయకులు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# అలంపూర్ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాల హుండీ లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కపెడుతున్న మహిళా సేవకులు

### హుండీ ఆదాయం 45.18 లక్షలు

అలంపూర్ టౌన్,మార్చి21(ప్రభాత ఉదయం) అష్టాదశ శక్తిపీఠలలో ఐదో శక్తి పీఠమైన శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి అమ్మవార్ల హుండీ లెక్కింపును ఆలయ అధికారులు గురువారం నిర్వహించారు.ఈ హుండీ లెక్కింపు ద్వారా రూ. 45,18,974 ఆదాయం వచ్చినట్లు ఈఓ పురేందర్ తెలిపారు. అందులో అమ్మవారి హుండీ ద్వారా రూ 38,75,701 స్వామి వారి హుండీ లెక్కింపు ద్వారా రూ. 5,81,150 అదే విధంగా అన్నదాన సత్రం ద్వారా రూ.62,123 ఆదాయం వచ్చింది. ఆలయాల ద్వారా 47 గ్రాముల బంగారం 397 గ్రాముల మిశ్రమ వెండి వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, చైర్మన్ చిన్ని కృష్ణయ్య అర్చకులు ఆనంద్ శర్మ ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# బొంతుకు మొండి చేయి..

### దానంకు ఎంపీ సీటు ఖరారు

హైదరాబాద్,(ప్రభాత ఉదయం):కాంగ్రెస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం టికెట్ ప్రకటించింది.ఇటీవల బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్లో చేరిన మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ సికింద్రాబాద్ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించినట్లు సమాచారం.ఒక దశలో ఆయనకే టికెట్ కేటాయిస్తారనే ప్రచారం సైతం జరిగింది.ఆయన అనుచరులు ఫ్లెక్సీలు సైతం ఏర్పాటు చేశారు.కానీ అధిష్ఠానం మాత్రం టికెట్ను దానం నాగేందర్ కు కేటాయించింది.

# గద్వాల్‌లోని పిజి సెంటర్‌లో గల పిజి కోర్సులలో అడ్మిషన్‌లు పొందగలరు

గద్వాల,మార్చి21(ప్రభాత ఉదయం) జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రంలోని నది అగ్రహారం వద్దనున్న గద్వాల పిజి సెంటర్ లో గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చవ్వా వెంకట్ రెడ్డి సభా అధ్యక్షతన పీజీ కోర్సుల పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గద్వాల పట్టణంలో గల మహారాణి ఆది లక్ష్మీదేవమ్మ డిగ్రీ కళాశాలలో చదువుతున్న బిఏ, బీకాం, బి.ఎస్ సి లైఫ్ సైన్స్, బి.ఎస్ సి ఫిజికల్ సైన్స్ డిగ్రీ కోర్సులలో చదువుతున్న విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పిజి కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసుకుంటున్న విద్యార్థులు అందరూ కూడా సి పి జి సెట్ ప్రవేశ పరీక్ష రాసి ఈ కళాశాలలో ప్రవేశం పొందవచ్చునని తెలిపారు. ప్రవేశం పొందిన విద్యార్థులకు వసతి గృహాలు అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపకార వేతనాలు పొందవచ్చునని, డే స్కాలర్స్ కు టిఎస్ఆర్టీసి బస్సు వసతి కూడా ఉందన్నారు. గద్వాల్ లోని పిజి సెంటర్ లో గల పిజి కోర్సుల గురించి తెలుగు ఇంగ్లీష్ కామర్స్ కంప్యూటర్ సైన్స్ ఎంబీఏ కోర్సుల వివరాలను మరియు ఉపాధి అవకాశాలను గూరించి సీనియర్ అధ్యాపకులు డాక్టర్ బండరపల్లి అరవింద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ డిగ్రీ కళాశాల ఆంగ్ల విభాగం అధిపతి పి.కృష్ణమూర్తి, తెలుగు విభాగం అధిపతి మేడిచర్ల హరి నాగభూషణం, అధ్యాపకులు సాపరే శంకర్ , మల్లికార్జున్, ప్రశాంతితో పాటు పిజి సెంటర్ గద్వాల అధ్యాపకులు బండరపల్లి అరవింద్, డా.మంగళగిరి శ్రీనివాసులు, డా.గోపినాథ్ రాథోడ్ డా.మహేందర్, గణేష్ ,అభిజ్ఞ, రంగారెడ్డి , డా. రవి శరిన్, రఫీ , డా. వేణుగోపాల్, నవీన్ గౌడ్, నరేష్ రెడ్డి, ఆంజనేయులు, లక్ష్మయ్య ,లక్ష్మణాచారి, ప్రేమ్ కుమార్, ఆంజనేయులు, గట్టయ్య, అధ్యాపకేతర బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# ధరణి అక్రమాలను ఆధారాలతో బయటపెడతాం

### మంత్రి పొంగులేటి!



హైదరాబాద్,మార్చి21(ప్రభాత ఉదయం) ధరణి ద్వారా జరిగిన అక్రమాలన్నింటినీ ఆధారాలతో సహా బయటపెట్టి, శ్వేతపత్రం విడుదల చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.గత సర్కారు ధరణిని రహస్య డాక్యుమెంట్‌గా చూసిందని, తమ ప్రభుత్వం ఏదీ దాచి పెట్టదని స్పష్టం చేశారు. ధరణిలో ప్రజలకు ఇబ్బంది కలిగించే విషయాలను తొలగించి.. మంచి వాటిని కొనసాగిస్తామన్నారు. గురువారం మీడియా ప్రతినిధులతో మంత్రి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రిజిస్ట్రేషన్ల శాఖను కూడా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ సమస్య నుంచి బయటపడ్డామని, మంచి నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. తమ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేసే ప్రసక్తే లేదన్నారు. మీడియా అకాడమీ ఛైర్మన్‌తో చర్చించి జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా తెలంగాణలో 14 స్థానాలు గెలుస్తుందని, ఇప్పుడున్న పరిస్థితుల్లో భారాసకు ఒకటో, రెండో వస్తే గొప్ప అని వ్యాఖ్యానించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.